# వేకువ జామున అగరాల వద్ద రోడ్డు ప్రమాదం

**-ముందు వెళ్తున్న గ్రానైట్ లారీని ఢీ కొట్టిన ఆర్టీసి బస్సు**
**-12 మందికి తీవ్రగాయాలు, 13 మందికి స్వల్పగాయాలు**
**-సకాలంలో స్పందించిన ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది**

చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: వేకువజామున అగరాల వద్ద ముందు వెళ్తున్న గ్రానైట్ లారీని ఆర్టీసి అద్దెబస్సు ఢీ కొట్టింది. వివరాల్లోకెళితే.. శ్రీకాళహస్తికి చెందిన ఆర్టీసి అద్దె బస్సు శుక్రవారం రాత్రి బెంగుళూరు నుండి శ్రీకాళహస్తికి 43 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శనివారం వేకువ జామున పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారి అగరాల – కోట సమీపంలో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిద్రమత్తులో ముందు వెళుతున్న భారీ గ్రానైట్ లారీని అతివేగంతో ఢీకొట్టడంతో డ్రైవర్ కండక్టర్ సహా 27 మంది గాయాల పాలయ్యారు. వీరిలో డ్రైవర్ ఖాదర్ భాషా, కండక్టర్ రత్న, మరో మహిళా ప్రయాణికురాలు భాగ్యమ్మ విషమ పరిస్థితిలో వుండటంతో ముందుగా రుయాకు అక్కడి నుండి ప్రైవేటు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద సమాచారం అందుకున్న 108 హైవే అంబులెన్స్, పోలీసులు, హైవే సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను చంద్రగిరి ఏరియా ఆసుపత్రి (సిహెచ్‌సి) కి తరలించారు.



గ్రానైట్ లారీని అతివేగంతో ఢీకొట్టడంతో, గాయపడిన ప్రయాణీకులు

సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డాక్టర్ ఠాగూర్, ఇతర వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వైద్య చికిత్సలందించారు. ఇందులో తీవ్రంగా గాయపడిన 12 మందికి ప్రాథమిక చికిత్సలు చేసి తిరుపతి రుయాకు తరలించారు. స్వల్పగాయాలైన 13 మందికి ఇక్కడే వైద్య సేవలందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## డ్వాక్రా సంఘాల్లో...

# దాదాపు రూ.2 కోట్లు స్వాహా!

**- ఇప్పటి వరకు ఆడిట్‌లో రూ.కోటి బయట పడిన వైనం - పరారీలో స్కాం ప్రధాన సూత్రధారి ఆర్.పి నుహీరా - బ్యాంకు, మెప్మా అధికారులు, ఆర్.పి ఆ ముగ్గురు కుమ్మక్కు - ఓ బ్యాంకుకు కొత్త మేనేజర్ రావడంతో బయట పడిన అతి పెద్ద స్కాం - నుహీరాపై కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నా అడ్డుపడుతున్న బ్యాంకు, మెప్మా క్రింది స్థాయి అధికారులు - మహిళా సంఘాల సభ్యులకు నోటీసులు బ్యాంకు నుంచి రావడంతో - లబోదిబో మంటున్న 40 సంఘాల్లో 25 సంఘాల్లోని 250 మంది సభ్యులు- దీనిపై చొరవ తీసుకుని బాధిత సభ్యులకు న్యాయం చేయాలని డ్వాక్రా సంఘాల సభ్యుల విజ్ఞప్తి**



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీలో పనిచేస్తున్న ఆర్.పి నుహీరా రూట్ మార్చింది. ఏకంగా తాను ఒకప్పుడు 40 సంఘాలకు సంబంధించి అన్ని లెక్కలను సభ్యుల ఆర్థిక లావాదేవీలను రాస్తుండేది. ఆమెకు పనిభారం పెరిగిందని 40 సంఘాల్లో నుంచి లత అనే ఆమెకు 15 సంఘాల అప్పగించారు. ఆ సంఘాల ఆర్థిక లావాదేవీలు సక్రమంగానే కొనసాగుతున్నాయి. మిగతా 25 సంఘాలు యథాప్రకారం నుహీరా రాస్తుండేది. ఈ నేపథ్యంలో నుహీర ఓ అడుగు ముందుకేసింది. తాను రాస్తున్న 25 సంఘాల్లోని 250 మంది సభ్యులను ప్రతి నెల అప్పటి బ్యాంకు మేనేజర్, క్రింది స్థాయి సిబ్బంది, మెప్మా క్రింది స్థాయి అధికారులు,సిబ్బందితో కుమ్మక్కై దాదాపు రూ.2 కోట్లు దిగమింగి పరార్ అయినట్లు బాధిత సభ్యుల నుంచి వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం నుహీరా ఏ రాష్ట్రంలో ఉందో...?ఏ దేశంలో ఉందో లేకుంటే తిరుపతిలోనే ఉంటూ రాజకీయ నడుపుతుందో తెలియరావడం లేదు అని బాధిత సభ్యులు లబోదిబో మంటున్నారు. ప్రతి నెల కరెక్ట్ డబ్బులను సభ్యుల నుంచి ముక్కుపిండి వసూళ్ళు చేసిన నుహీరా ఆ డబ్బులను బ్యాంకుల్లో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించి లగ్జరీ జీవితాన్ని గడుపుతున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మరో 15 గ్రూపులు వ్రాస్తున్న లతా అనే ఆమె దగ్గర రూ.4లక్షలు తీసుకుని వడ్డీ ఇస్తానని మోసం చేసినట్లు బాధితురాలు లత నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. నుహీరా చేసిన అతిపెద్ద స్కాంపై సభ్యులు లబోదిబో మంటున్నారు. చేసేది ఏమీలేకా కలెక్టర్‌ను కలిసేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చి వారి బాధను కలెక్టర్‌కు వినతి పత్రం రూపంలో ఇవ్వాలని వచ్చినా వారి ఆటను బ్యాంకు, మెప్మా క్రింది స్థాయి అధికారులు మాత్రం ఒప్పుకోక పోవడం పై పలు అనుమానాలు కలుగుతున్నాయి. సభ్యులు గత ఎనిమిది నెలల నుంచి బ్యాంకుకు డబ్బులు చెల్లించలేదని సభ్యులకు నోటీసులు బ్యాంకు అధికారులు ఇవ్వడంతో ఈ అతిపెద్ద స్కాం బయట పడిందని చెప్పక తప్పదు. ఓ కూటమి నేత సురేష్ సభ్యులకు జరిగిన అన్యాయంపై పోరాడి న్యాయం చేయాలనుకున్నా ఆయన ఆటలను బ్యాంకు, మెప్మా క్రింది స్థాయి అధికారులు సాగనివ్వక పోవడంతో ఆయన బాధపడడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. దీనిపై కలెక్టర్, మెప్మా జిల్లా అధికారులు వెంటనే స్పందించి రూ. 2కోట్ల అతిపెద్ద స్కాంకు పాల్పడిన నుహీరాను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని, తగు విచారణ జరిపి ఆమె తిన్న డబ్బులను ఇచ్చి బాధిత సభ్యులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే నుహీరా తిరుపతిలోనే ఉంటూ కొత్తగా వచ్చిన ఓ బ్యాంకు మేనేజర్ మేడమ్, 15 గ్రూపులు రాస్తూ 4 లక్షల రూపాయలు సాయం చేసిన వారిద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు రెడీగా ఉన్నట్లు బాధిత సభ్యుల నుంచి వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం. అయితే మొత్తం మీద దాదాపు అన్ని డ్వాక్రా సంఘాల ఆడిట్ జరిగితే దాదాపు రూ. 10 కోట్లు వరకు స్కాం జరిగిందనీ, ఇందులో బ్యాంకు అధికారుల నుంచి మెప్మా, ఆర్.పిలు, ప్రభుత్వ అధికారులు, చివరికి రాజకీయ నాయకులు ప్రమేయం కూడా ఉందని చెప్పడం కొసమెరుపు.

**- తరువాయి భాగం రేపటి సంచిలో...**

## నేడు ఆర్జిత సేవలు రద్దు... రాత్రి శాంతి అభిషేకం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి శనివారం ప్రభాతవార్తకు తెలిపారు. అయితే రాహుకేతుదోష నివారణ పూజలు మాత్రం యథా విధిగా నిర్వహించబడుతుందన్నారు.రాత్రి స్వామి వారికి గ్రహణ సమయంలో శాంతి అభిషేకాలు నిర్వహించబడుతుందని, అయితే ఈ అభిషేకాలకు అతిథులు, బయటి వారిని అనుమతించేది లేదని అర్చకులు మాత్రమే నిర్వహిస్తారని ఆయన వివరించారు. రాత్రి అభిషేకాలు నిర్వహించిన మీదట ఆలయం మూసివేసి సోమవారం ఉదయం 6గంటల నుంచి ఆలయంలో దర్శనాలు, రాహుకేతుదోష నివారణ పూజలు ఆర్జిత సేవలుంటాయని వివరించారు.

**ఆదివారం యథావిధిగా రాత్రి వరకు ఆలయం:**

సాధారణంగా చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తారని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయం మాత్రం రాత్రి 9గంటల వరకు యథావిధిగా స్వామి అమ్మవార్ల దర్శనాలతో పాటు రాహుకేతు దోష నివారణ పూజలు నిర్వహించబడుతుందని ఇఓ ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు.

# కన్నతల్లే...కసాయి

**-కాలువలోపడేసి ఆపై మిస్సింగ్ డ్రామా -అనుమానంతో విచారణతో తెగిన ఉత్కంఠత**



చిన్నారి రమ్య (ఫైల్ ఫోటో)

తిరుపతి,సెప్టెంబర్ 6ప్రభాతవార్త: కటిక పేదరికం....ఆపై భర్త తాగుడుకు అలవాటుపడటం చివరకు ముగ్గురు కుమార్తెలను పోషించలేక కన్నతల్లే కర్కశంగా మారి ఆరునెలల చిన్నారి రమ్యను కాలువలో పడేసి హతమార్చింది. ఈ విషాదసంఘటన శనివారం ఉదయం జరిగితే సాయంత్రానికి నెలకొన్న ఉత్కంఠకు అలిపిరి పోలీసులు తెరదించారు. తిరుపాల్,చందనలు తిరుపతి కొరమేను గుంటలో కాపురముంటారు. పాతసామాన్ల వ్యాపారం చేసుకుని జీవించే తిరుపాల్‌కు అప్పటికే ఇద్దరు కుమార్తెలు. వారికోసం తల్లి చందన స్థానికంగా ఉన్న పలు ఇళ్ళలో పాచిపనులు చేసి పిల్లలను పోషిస్తోంది. ఆరునెలల క్రిందట మరో చిన్నారి రమ్యకు జన్మనిచ్చింది. అయితే పేదరికం అడ్డుగా మారడంతో ముగ్గురు పిల్లలను పోషించలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో పిల్లలు లేని కొందరు చిన్నారిని తమకు ఇస్తే సాకుతామని తెలిపారు. అయితే అందుకు తిరుపాల్ ససేమిరా ఒప్పుకోలేదు. తాగుడుకు బానిసైన భర్తతో కాపురం వేగలేక పిల్లలను పోషించుకోలేక శనివారం ఉదయం 5.30గంటలకు ముగ్గురుపిల్లలను ఇంటికి సమీపంలోని కాల్వలో పడేసింది. అయితే ఆరునెలల చిన్నారి ఊపిరాడక నీళ్లలోనే మునిగి ప్రాణాలు కోల్పోయింది. అయితే ఈ సంఘటనపై అనుమానం రాకుండా చందన చిన్నారి కనిపించడంలేదని ఆపై ఏమీ తెలియనట్లు బుకాయించి ఇంటివద్ద ఆందోళన చెందారు. కొద్దిసేపట్లోనే పాపాకోసం తల్లిదండ్రులు హైరానా పడి పరిసరాల్లో వెదికారు. అయినా చిన్నారి ఆచూకీ తెలియలేదు. ఈ కేసును తొలుత మిస్సింగ్ క్రింద నమోదు చేసిన అలిపిరి పోలీసులు తీవ్రంగా పరిగణించి గాలింపు చేపట్టారు. తీవ్రంగా తీసుకున్న ఈ కేసులో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంఘటనాస్థలికి చేరుకున్నారు. డ్రోన్‌లతో గాలింపు చేపట్టారు. చివరకు అనుమానంతో చందనను అదుపులలోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెల్లడించింది. చివరకు నవమాసాలు మోసి కన్నకూతురు భారం కావడంతో కసాయిగా మారి చెరువులో పడేసి హతమార్చింది. కుటుంబసభ్యుల నుండి సేకరించిన సమాచారంతో సిఐ రామకిశోర్ ఈ కేసులో మిస్టరీని వీడించారు.

# అధికార నందివాహనంపై పార్వతీసుతుడు



కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాధుడు శనివారం అధికార నందివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో శనివారం జరిగిన అధికార నందివాహన సేవతో ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి కాణిపాకం వళ్ళువర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూల విరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించారు. అలాగే రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి శాస్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన అధికార నంది వాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## తటస్థ కార్పొరేటర్ల భవిష్యత్తు...

# ఆగమ్యగోచరం!

**-పదవుల ఆశలు ఆవిరి!**



ప్రభాతవార్త–తిరుపతి:
అనుకున్నది ఒక్కటి...జరిగిందొక్కటి అనే చందంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో గత ఏడాది వైసిపిని వీడిన పెద్దసంఖ్యలో కార్పొరేటర్ల పరిస్థితి నూనెలోపడిన ఈగ లాగా మారింది. మొన్నటివరకు మేయర్ పదవితోబాటు కీలకమైన పదవులు వస్తాయని కూటమిపార్టీల పంచనచేరిన కార్పొరేటర్లకు ఉన్నపళంగా గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం 2026జనవరిలో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సంకేతాలిచ్చింది. అంతేగాక మార్చి,ఏప్రిల్‌లో జరగాల్సిన ఈ ఎన్నికలు ముందుగా జనవరిలోనే జరిపేందుకు అధికార యంత్రాంగం సిద్ధంకావాలని, అందుకు తగిన ఏర్పాట్లుచేసుకోవాలని ఆదేశించింది. పంచాయతీ రాజ్ శాఖ, పురపాలక సంస్థల కమిషనర్లకు ఇప్పటికే అధికారిక సమాచారం చేరవేసినట్లు గుప్పుమంటోంది. ఇంతకాలం పదవులకోసం ఆశతో ఎదురుచూసిన వైసిపీ వీడిన కార్పొరేటర్లు ఇప్పుడు తమ భవిష్యత్తు ఏంటనే ఆలోచనలో పడ్డారు. నిన్నటివరకు వీరంతా అసలు ఏ పార్టీలో ఉన్నామనేది కూడా జనానికి చెప్పుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లుకు సిద్ధమవు తుండటం మాత్రం తిరుపతిలోని ఎక్కువసంఖ్యలో కార్పొరేటర్లు ఎన్నికల్లో ఏపార్టీ నుండి పోటీచేయాలి, అస్సలు పార్టీ మారి వచ్చిన వారికి కూటమిపార్టీల అధినేతలు తగిన ప్రాధాన్యత నిస్తారా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. 2021 మేనెలలో జరిగిన తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో 50 డివిజన్లకుగాను 48డివిజన్లు అప్పటి అధికార వైసిపి ఏదో ఒక ప్రత్యామ్నాయంతో కొన్ని ఏకగ్రీవాలు ,కొన్ని ఎన్నికల ద్వారా సత్తాచాటింది. అయితే ఇప్పుడు 47మంది వైసిపి కార్పొరేటర్లలో 25మంది వరకు గత ఏడాది కూటమి పార్టీల్లో ఒకటైన జనసేనపార్టీలో ఐదుమంది చేరారు. మరో 20 మంది వరకు టిడిపిలో చేరేందుకు సన్నాహాలు చేసుకున్నా అందుకు అధిష్టానం నుండి అనుమతిలేక పోయింది. పైగా పార్టీ మారిన వారికి టిడిపిలో చేర్చుకోవడం వద్దనే వ్యాఖ్యలు కార్యకర్తల నుండి అధినేతకు చేరాయి. దీంతో గత ఎనిమిదినెలలుగా వైసిపిని వీడి తటస్థులుగా ఉన్న కార్పొరేటర్లు స్తబ్దుగానే ఉంటున్నారు. ఏకంగా గురువారం ఎస్ఈసి వెలువడించిన సమాచారంతో ఇప్పుడు అయోమయంలో పడ్డారు. పైగా అక్టోబర్ 15వ తేదీలోపు వార్డుల పునర్విభజన,రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని, నవంబర్ 15లోగా ఓటర్ల జాబితా ప్రచురణ జరగాలని, నవంబర్ 15లోగా ఎన్నికల అధికారుల నియామకం జరుగుతుందని సంకేతాలు వెలువడ్డాయి. మరీ పదినెలల క్రిందట వైసిపిని వీడిన కార్పొరేటర్ల భవిష్యత్తు ఆయా డివిజన్ల జనంచేతిలో ఉందనేది చర్చమొదలైంది. మరీ వీటన్నిటినీ సానుకూలంగా మలచుకుని మళ్ళీ కార్పొరేటర్లుగా ఏ పార్టీలనుండి పోటీచేస్తారనేది మాత్రం గప్‌చుప్ రహస్యం.

## ట్రంపు విధిస్తున్న సుంకాలను...

# వ్యతిరేకించాలి

**వామ పక్ష నాయకులు డిమాండ్**

గూడూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: ట్రంపు విధిస్తున్న సుంకాలను వ్యతిరేకిస్తూ గూడూరు పట్టణం లోటవర్ క్లాక్ సెంటర్ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామ పక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపీఎం నాయకులు ఎంబేటి చంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయి. ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి మన రాష్ట్రం నుండి రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు అని పేర్కొన్నారు. అలాగే గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో అనకాపల్లి, శ్రీసత్యసాయి, గుంటూరు, పల్నాడు వంటి జిల్లాల్లోని ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి ఎసరు వస్తోందన్నారు. ఇందులో అత్యధికులు మహిళా శ్రామికులు కావడం గమనార్హం అని పేర్కొన్నారు. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతున్నదన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయన్నారు. ఇప్పటికే అమెరికా వెళ్లినవారి పరిస్థితి కూడా ఆగమ్యగోచరంగా ఉందన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కిమ్మనకపోవడం గర్హనీయమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదు అన్నారు. ట్రంప్‌తో సహా అమెరికా పెత్తందార్లు మనదేశాన్ని అవమానపరుస్తూ ప్రకటనలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం కిమ్మనడం లేదు అని ఎద్దేవా చేశారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడపాల ప్రసాద్, మణి, బి, చంద్రయ్య, దారా కోటి, గుర్రం రమణయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, జి మధు, భాస్కర్ రెడ్డి, జిలాని, సీపీఐ నాయకులు జి.శశి కుమార్, రమేష్, సునీల్, మీరాబాయి, రాము, సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు సునీల్, తదితరులు పాల్గొన్నారు.




వామ పక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

# జాతర వైభవంగా నిర్వహిస్తాం

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



బ్యారికేట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త: ఈనెల 10,11వ తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామశక్తి స్వరూపణ పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోనే గింజల వీరయ్య కళ్యాణ మండపంలో పట్టణంలోని భక్తులతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరను రాష్ట్ర పండుగ చేసినందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. జాతర నిర్వహణకు 40 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. ఇంకా జాతర నిర్వహణకు భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జాతర నిర్వహణపై భక్తులు ఇచ్చిన సూచనలు సలహాలు పాటిస్తామన్నారు. జాతర రెండు రోజులు ట్రాఫిక్ నియంత్రణకు పట్టణంలోనికి పదో తేదీ రాత్రి నుండి వాహనాలు రానేకుండా నిలుపుదల చేస్తామని తెలిపారు. భక్తులు కూడా సహకరించాలని ఆయన కోరారు. కార్లు వంటి పెద్ద వాహనాలు పట్టణంలోకి వస్తే ట్రాక్ జామ్ అవుతుంది అని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి, తాసిల్దార్ నరసింహారావు, కమిషనర్ వెంకటరామిరెడ్డి, పోలేరమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్‌పై సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో సెప్టెంబరు 14,15వ తేదీల్లో జరుగు జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్‌కు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఏపీ లెలిస్టేలివ్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యలతో కలిసి శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ మహిళా సాధికారితకు కాన్ఫరెన్స్ విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్‌డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, ప్రోటోకాల్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివశంకర్ నాయక్, అడిషినల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీపీవో సుశీలదేవి, తిరుపతి, చంద్రగిరి డీఎస్పీలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్పీ సురేందర్‌శెట్టి సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## "తుడ"చైర్మన్ కృషిని అభినందించిందిన మంత్రి లోకేశ్

**త్వరలో శెట్టిపల్లి లబ్ధిదారులకు పట్టాలు**



తిరుపతి,సెప్టెంబర్ 6ప్రభాతవార్త: తుడ పరిధిని విస్తరించడం, ఆ ప్రాంతంలోని శెట్టిపల్లి వాసుల సుదీర్ఘసమస్యకు పరిష్కారం చూపిన రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తుడ చైర్మన్ దివాకర్‌రెడ్డి కలిశారు. శనివారం అమరావతిలో మర్యాదగా కలిసిన దివాకర్‌రెడ్డి వందరోజుల్లో చేపట్టిన అభివృద్ధిపనులను మంత్రికి విన్నవించారు. త్వరలో శెట్టిపల్లి లబ్దిదారులకు పట్టాలను పంపిణీ చేసి లేఔట్ అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు.

# కరుడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు!

**-నాలుగున్నర లక్షల విలువైన బంగారు వెండి ఆభరణాలు స్వాధీనం -గాజులమండ్యం పోలీసులను అభినందించిన ఎస్పీ**



ఆభరణాలను ప్రదర్శిస్తున్న పోలీసులు

రేణిగుంట సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో చాకచక్యంగా అంతర్రాష్ట్ర బంగారు నగల దొంగ తమిళనాడు రాష్ట్రం తుత్తుకుడి జిల్లా తిరుచెందూరు గ్రామానికి చెందిన తంగ ముత్తు (51) ను రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 35 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పిన వివరాల మేరకు... తమిళనాడు రాష్ట్రం తుత్తుకూడి జిల్లా తిరుచెందూరు గ్రామానికి చెందిన తంగముత్తు తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పలు జిల్లాల వివిధ ప్రదేశాల్లో రాత్రి సమయాన ఒంటరిగా ఇంటి తాళాలు పగలుగట్టి దొంగతనాలు చేసేవాడు. ఇతనపై ఇరు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. దాదాపు 30 సంవత్సరాలుగా దొంగతనాలు చేస్తున్నాడు. పలుమార్లు శిక్షలు కూడా అనుభవించి ఉన్నాడు. నేరవృత్తికి అలవాటు పడి దొంగతనాలు చేయడం మాన లేదు. 2021 వ సంవత్సరం గాజులమండ్యం నందు జరిగిన దొంగతనంపై అప్పటి స్టేషన్ అధికారి కేసు నమోదు చేశారు. ఇటీవల కాలం అరెస్టు చేసినప్పుడు సేకరించిన వేలిముద్రలు అప్పట్లో గాజులమండ్యం నందు జరిగిన దొంగతనం కేసులో దొరికిన వేలిముద్రలు మ్యాచ్ కావడంతో పోలీసులు కేసును లోతుగా అధ్యయనం చేసి నిందితుని కోసం గాలింపు చర్యలు మొదలెట్టారు. ఈ నేపథ్యంలో నిందితుడు రేణిగుంటలో ఉన్నట్లు సమాచారం రావడంతో రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, ఎస్సై సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్ల గోపి, సుబ్రహ్మణ్యం, మురళి కానిస్టేబుళ్ల గోపి, మణి, వాసు, రాజేష్, నిందితుని కదలికలపై నిఘా పెట్టారు. నిందితుని రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దాదాపు 4,30,000 రూపాయల విలువైన బంగారు వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయాన్ని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో డిఎస్పి శ్రీనివాస రావు ధ్రువీకరించారు. కేసులు అత్యంత కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించినట్లు తెలిపారు. వీరందరికీ డీఎస్పీ క్యాష్ రివార్డులు ఇచ్చారు. సమావేశంలో సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్సై సుధాకర్, పి ఎస్ఐ ప్రవల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.



పెరుమాళ్, శ్రీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## రైతుల్ల కలసాకారం చేసింది సిఎం చంద్రబాబే



**రామకుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కుప్పం ప్రాంత రైతుల కలసాకారం చేసింది సిఎం చంద్రబాబునాయుడేనని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం హంద్రీ–నీవా కాలువలు వారు పరి శీలించారు. కుప్పానికి సిఎం చంద్రబాబు నీరు అం దిస్తే నీరు ఆగిపోయిందని వైకాపా సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు చేయడం దారుణమన్నారు. సిఎంకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, గోవిందప్ప, విజయ్‌కుమార్, రాజేష్, వెంకటేష్, శంకర్, మురుగేష్, గణేష్, హరికృష్ణ, మంజునాథ్ పాల్గొన్నారు.

## బాలుడి ఆచూకీకై చెరువులో కొనసాగుతున్న గాలింపు



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధి పరమసము ద్రం చెరువులో ఈత కొడుతూ గల్లంతైన యువన్‌శంకర్ (16) ఆచూకీకై అటు పోలీసు యం త్రాంగం, ఇటు అగ్నిమాపక సిబ్బంది, తమిళనాడు నుంచి వచ్చిన ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు గాలింపు కొనసాగి స్తున్నాయి. శనివారం ఉదయం నుంచే చెరువులో దిగి గాలించారు. వీరికి తోడు గజ ఈతగాళ్లు సైతం చెరువులో యువన్ ఆచూకీ కోసం ప్రయత్నించారు. కాగా పరమసముద్రం చెరువు వద్దకు శనివారం పెద్ద ఎత్తున జన ం చేరుకున్నారు. రాత్రి దాకా యువన్ శంకర్ ఆచూకీ తెలియరాలేదని గాలింపు చర్యలు కొనసాగిస్తామని అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు.

## బేటరాయస్వామి కొండ వద్ద శ్రీవారి కళ్యాణోత్సవం



కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: పెరటాసి మాసం సందర్భంగా మూడో శనివారం అయిన అక్టోబర్ 4న కుప్పం శ్రీ బేటరాయస్వామి కొండ వద్ద శ్రీవారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కొండ వద్ద జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)వారిచే ఆరోజు శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహిం చడంతో పాటు భక్తులకు సిఎం చంద్రబాబు నాయుడు తరపున భారీ ఎత్తున అన ్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన కమిటీలను సైతం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఏ మనోహర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ప్రతాప్‌సింహ, సికె విజయ్, మహేంద్ర, చెక్కునత్తం మణి, సంతోష్, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (ఆదివారం)

పగలు : అభిషేకం రాత్రి : రావణబ్రహ్మ వాహనసేవ

**ఉభయదారులు : పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్దంపల్లె, ముద్దురామాపురం గ్రామస్థులు.**

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ప్రవచనములు, భక్తిరంజని, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## ఘనంగా వేద విద్వత్ సదస్సు



**కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేద విద్వత్ సదస్సును ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో ఈసదస్సును నవరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ అలంకార మండపంలో ఈసదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల నుండి వచ్చిన 40 మంది వేదపండితులచే నాలుగు వేదాలను పఠనం గావించారు. అనంతరం వారిని ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన అధికార నందివాహనసేవ సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలు ప్రాంతాలకు చెందిన కళాకారులచే ధార్మికోపన్యాసం, భక్తిసంగీత కచ్చేరిలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాట క ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు కళా బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

## గణనాధుని దర్శించుకున్న ఏపీ అదనపు ఐజీ



**కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ అదనపు ఐజీ అడ్మిన్ శ్రీకాంత్ శనివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంటసూపరెండెంట్ కోదండపాణి, స్థానిక ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజి నాయుడు లతో పాటు చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు చంద్రగ్రహణంతో కాణిపాకం ఆలయం మూసివేత

**కాణిపాకం,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం కాణిపాకం ఆలయాన్ని మూసవేస్తున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈనెల 7న ఆదివారం రాత్రి 9.57 గంటల నుండి అర్ధరాత్రి 1.26 గంటల వరకు చంద్రగ్రహణ సంభవిస్తున్నందున ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాలైన శ్రీమణికంఠేశ్వరాలయం, శ్రీవరదరాజస్వామి ఆలయంలను ఆదివారం సాయంత్రం 4 గంటల నుండి మూసివేస్తున్నట్లు తెలిపారు. తదుపరి సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ది, పుణ్యాహావాచనం, గ్రహణశాంతి,అభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 6 గంటల నుండి భక్తులు సర్వదర్శనం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు,

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 12 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జిల్లా స్థాయి సన్మానగ్రహీతలైన రామిరెడ్డి, వెంకటరెడ్డి, నాగులు, మురగయ్య, శైలజ టీచర్లను ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ 2 భాస్కరబాబు, హెచ్ఎం శారద ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జగదీష్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యావ్యవస్థకు అందించిన సేవలను కొనియాడారు. అదేవిధంగా దేశానికి చేసిన పలు కార్యక్రమాలను వివరించారు.

## శ్రీ సెల్వవినాయక స్వామి ఆలయం వద్ద అన్నదానం



**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం జెండామాను వీధిలో వెలసిన శ్రీ సెల్వ వినాయక స్వామి ఆలయం వద్ద వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. రాత్రి ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మహేంద్ర



**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా హెచ్.మహేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. మహేంద్ర పుత్తూరు ఆర్టీసీ డిపోలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా పని చేశారు. అలాగే తిరుపతి డివిజన్‌లో వివిధ విభాగాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తిం చారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ ప్రతాప్‌కు మార్, చలపతి, శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం,

## ఆమెరికా టారిఫ్‌ల పెంపు వ్యతిరేకంగా నిరసన



**చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** భారతీయ సరుకుల దిగుమతులపై సుంకంను 50 శాతం పెంచుతూ ఆమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం, సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఆమెరికా అధ్యక్షుడు భారతీయ సరుకుల దిగుమతులపై సుంకంను 50 శాతం పెంచడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని ధ్వజమెత్తారు. భారతదేశంపై అమెరికా పెత్తనంను ఎలాంటి పరిస్థితుల్లోను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు నాగరాజు, గంగరాజు, మణి, చంద్ర, విజయగౌరి, రమాదేవి, రఘు, బాలాజీరావు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన డియంహెచ్‌వో



**వెదురుకుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్యాధికారిణి సుధారాణి శనివారం ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆవమె మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య కేంద్రంకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రంకు వైద్యం కోసం వచ్చే రోగులకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. తరువాత తిరుమలయ్యపల్లెలో యరో కేంద్రం ఏర్పాటుకు వచ్చిన వినతుల పై ప్రభుత్వం తిరుమలయ్యపల్లెలో కొత్త ఆరోగ్య కేంద్రం మంజూరుకు గ్రీన్‌సిగ్నలు ఇచ్చే పరిస్థితులు ఉన్నట్లు చెబుతున్నారు. అక్కడ స్థలం పరిశీలించి స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కృష్ణ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వైద్యాధికారిణిని సన్మానించిన బిజేపి నాయకులు



**వెదురుకుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** జిల్లా వైద్యాధికారిణి సుధారాణిని శనివవారం మండల భారతీయ జనతా పార్టీ నాయకులు దుశాలువతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆమెతో మాట్లాడుతూ మండలంలోని తిరుమలయ్యపల్లెలో ప్రాథమిక ఆరోగ్యం మంజూరు కోసం గతంలో ఎమ్మెల్యే థామస్, ఆరోగ్యశాఖామంత్రికి వినతిపత్రం సమర్పిం చడం జరిగిందన్నారు. పచ్చికాపల్లంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్య సేవలకు రావలంటే పేద బడుగు బలహీన వర్గాల రోడులు పడుతున్న కష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోడి రెడ్డి అశోక్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంగా రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి, మండల యువ మోర్చా ఉపాధ్యక్షులు దావమోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిఎన్ ట్రస్ట్‌చే నీటి శుద్ధి యంత్రాలు వితరణ



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త** కుప్పం బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కుప్పం లయన్స్‌క్లబ్ సహకారంతో మండలంలోని కంగుంది ప్రభుత్వ హైస్కూల్‌కు, రామకుప్పం, దండికుప్పం హాస్టళ్లకు అరవై వేల విలువ చేసే నీటిశుద్ధి యంత్రాలను బిసిఎన్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సునీల్‌రాజ్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన వస్తువులు సమకూర్చడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఆశయంతో నీటిశుద్ధి యంత్రాలు అందించినట్లు తెలిపారు. ఈసందర్భ ంగా హెచ్ఎం శ్రీనివాసులు దాత సునీల్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంసి ఛైర్మన్ వెంకటేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు లెనిన్, సెంధిల్‌కుమార్, వరదరాజులు, జయరాంనాయుడు, ఉపాధ్యాయులు మనోహర్, వెంకటరమణ, లావణ్య,వాణి, భవాని, వార్డెన్లు సుధాకర్,దామోదర్ పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అజీజ్‌ను కలసిన దేశం నేతలు



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను శనివారం టిడిపి కుప్పం మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మాజీ ఎంపిటిసి ఉమాపతి నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని ఇది తనకు దక్కిన అదృష్ట మన్నారు. మైనారి ్టల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## సత్యసాయి జిల్లా వాసి అరెస్ట్

**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 3వతేది నమోదైన కేసులో సత్యసాయి జిల్లా వాసి అయిన నాగిరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ఇతని ఫోన్‌ను పరిశీలించగా తప్పుడు ప్రచారాలు పోస్ట్ చేయడంతో పాటు ప్రభుత్వ పెద్దలపై సైతం ఇష్టం వచ్చినట్లు పోస్టు లు చేయడాన్ని గుర్తించామన్నారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలకు సంబంధించి సంబంధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ దినపత్రికతో పాటు విలేకరులపై సైతం కేసు నమోదు చేశామని తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కుప్పంలో 30పోలీస్ యాక్ట్ అమలు : డిఎస్పీ



**కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ మణికంత చందోలు ఆదేశాల మేరకు కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్‌ను సెప్టెంబర్ 30వ తేది వరకు అమలు చేస్తున్నట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజల యొక్క శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ కాలేజ్‌లో దొంగలు పడ్డారు

**శాంతిపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. కళాశాలలో ఉన్న సిసి కెమెరాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి డివిఆర్ సెట్‌కు సంబంధించిన పరికరాలు చోరీ చేశారు. రికార్డులన్నీ చిందర వందర చేశారని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ప్రతి నీటిబొట్టు సద్వినియోగంకు చర్యలు : ప్రభుత్వ విప్



**శాంతిపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కుప్పం ప్రాంతంలో ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకునేలా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి 1.39కోట్లతో స్థానిక పాలారు నది చెక్‌డ్యామ్ మరమ్మత్తు పనులకు భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిత్వరలో కుప్పానికి గండికోట జలాలు తెచ్చేందుకు సైతం సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. నీళ్లు లభిస్తే పరిశ్రమలు సైతం వస్తాయని ఆదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, మణి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న,గోపాల్, దాము, బసవరాజు, చలపతి,బాలు, రాజారెడ్డి, బాలకృష్ణనాయుడు, సుగుణమ్మ, చంద్రకళ, అనసూయ, శ్యామలమ్మ పాల్గొన్నారు.

## శాంతిపురంలో యూరియా కొరత లేదు

**శాంతిపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని వ్యవసాయాధికారి యువకిషోర్ తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 52 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే అబకలదొడ్డి, రాళ్లబూదుగూరు, బండపల్లి, కొలమడుగు రైతు సేవా కేంద్రాల్లో మరో నలభై టన్నుల యూరియా ఉందన్నారు. యూరియాను ఎంఆర్‌పి ధర అయిన రూ266.5లకు మాత్రమే బస్తాను విక్రయించాలన్నారు. అధిక ధరలకు ఎవరైనా విక్రయించడంతో పాటు ఇతర ఎరువులను లింక్ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తెదేపా కార్యకర్త మృతి... ఆర్థికసాయం



**రామకుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మండలం లోని బగళనత్తంకు చెందిన తెదేపా కార్యకర్త తిమ్మా రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలు సుకున్న స్థానిక నేతలు ఆయన మృతదేహానికి నివా ళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం పార్టీ తరపున పదివేల రూపాయల సాయం అందించారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, మునిరెడ్డి, గంట్లరెడ్డి,

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం



**సదుం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపల్లి లో శ్రీ వెంకటేశ్వర పాదాలు ఆల యంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటే శ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కళ్యా ణోత్సవం జరిపించారు. ఆలయ నాలుగో వార్షికో త్సవం సందర్భంగా ఉదయం స్వామివారికి వివిధ రకాలైన సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి అనంత రం విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి కల్యాణోత్సవం జరిపించారు. అద విధంగా ఉబయదారులను శేష వస్త్రాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానపర్పాటు చేశారు.

## బెయిల్‌పై విడుదలైన మిధున్‌రెడ్డికి ఘన స్వాగతం



**సదుం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** నెల రోజులకు పైగా రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధునరెడ్డి శనివారం బెయిల్ పై విడుదలయ్యారు. త్వరలో జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆయనకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. జైలు వద్ద తిరుపతి ఎంపీ గురుమూర్తి, సదుం జడ్పీటిసి సోమశేఖర్ రెడ్డి,పులిచెర్ల ఎంపిపి సురేందర్ రెడ్డి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గనీ భరత్, సదుము మండలానికి చెందిన పచ్చారు మాకులపల్లె రెడ్డిప్పరెడ్డి, రమణారెడ్డి, పాలమంద సర్పంచ్ మనోహర్ రెడ్డి, పలువురు ఆయనకు స్వాగతం పలికారు. మిథున్ రెడ్డికి బెయిల్ రావడం పట్ల సదుము మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## నిమజ్జనానికి వెళ్ళిన గణపయ్య



**పుంగనూరు, రూరల్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ప్రతిష్టించిన శ్రీ విఘ్ననాధుడిని శనివారం ఉదయం మేళ వాయిద్యాల నడుమ భక్తుల ఘన శోభాయాత్రతో నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొనగా, శ్రీ వారాహి టీం సభ్యులు సేవలు అందించారు.

## యాచకులపై చిన్న చూపు తగదు



**పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** సమాజంలో యాచకులను చిన్నచూపు చూడరాదని, వారు కూడా ఒకప్పుడు మనలా గొప్పగా బతికిన మనుషులే నని గుర్తించాలని విశ్రాంత డిఎస్పి, దేశం నాయకుడు సుకుమార్ బాబు అన్నారు. భాద్రపద మాస శనివారం సందర్భంగా ఉదయం ఆయన శ్రీ వెంకటరమణ స్వామి ఆలయం వద్ద యాచకులకు పంచ ధోవతి, చీరలు పంపిణీ చేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో సుకుమార్ బాబు మాట్లాడుతూ శ్రావణ భాద్రపద ఆశ్వీయుజ కార్తీక మాసాలలో శనివారాలలో ప్రత్యేక కార్యక్రమాలు రూపకల్పనకు వచ్చే ఏడాది నుంచి మరింతగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జీవన్ జన్మదిన వేడుకలు



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ సోదరుడు, తెదేపా యువ నాయకుడు గురజాల జీవన్ జన్మదిన వేడుకలను శనివారం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిత్తూరు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అలాగే గుడిపాల మండల కేంద్రంలో కేట్ కట్‌చేసి అన్నదానం, పాపసముద్రంలో చిన్నారులకు బొమ్మలు పంపిణీ చేసారు. ఈ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సిఎంటి త్యాగరాజ్, చిత్తూరు జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, వెంకటేశ్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రఘు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పూలమాల వేసి పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసారు.

## బృందావన్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, సంతపేటలోని బృందావన్ సీనియర్ సెకం డరీ కళాశాల నందు శనివారం పాఠశాల అధ్యక్షుడు విజయభాస్కర్, ప్రిన్సిపాల్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియాతేజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచేత పుష్పగుచ్చాలను అందించి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు. బృందావన్ కళాశాల ఉత్తమ **ఉద్యోగిని సుమతి:** కళాశాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న సుమతిని ఉత్తమ ఉద్యోగినిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎంపిక చేసి మెమోంటో అందజేసారు. కాగా ఉత్తమ ఉద్యోగినిగా ఎంపికైన సుమతికి పాఠశాల డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అన్వర్‌హుస్సేన్



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రముఖ్య మంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకొన్న పివికెయన్ కళాశాల ఉర్దూ అధ్యాపకులు అన్వర్‌హుస్సేన్‌ను ప్రిన్సిపాల్ డా. జీవన జ్యోతి శనివారం ఘనంగా దుశ్శాలువతో సత్కరిం చారు. విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడం అధ్యాపకుల ప్రథమ కర్తవ్యమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఐక్యుఏసి సమన్వయకర్త హరిప్రసాద్, అకడమిక్ సమన్వయకర్త భానుప్రకాష్, ఎన్‌ఆర్‌సి సమన్వయకర్త జయచంద్రుడు, గోపినాయక్, చెన్నకేశవ, మల్లికాభ్రమరాంబిక, కుసుమకుమారి పాల్గొని అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

## వృద్ధుడిపై దుండగుల దాడి



**–రూ.5 వేలు నగదు, మొబైల్‌తో పరారీ**

**పలమనేరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఏమరుపాటుగా నడచి వెళుతున్న వృద్ధుడిపై గుర్తు తెలియని నలుగురు దుండగులు దాడి చేసి రూ.5 వేలు నగదు, మొబైల్ ఫోన్‌తో పరారీ అయ్యారు. పలమనేరు కొత్తపేటకు చెందిన రఫీ (65) అనే వృద్ధుడు ఈ నెల 5న రాత్రి 7 గంటల సమయంలో చీకట్లో మదనపల్లె రోడ్డులో వస్తుండగా గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు దాడి చేశారు. వృద్ధుడిని చితకబాది జేబులో వున్న డబ్బు, మొబైల్‌ఫోన్ లాక్కొని పరారీ అయ్యారు. లభించిన ఆధారాలను బట్టి పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ



**చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌ను శనివారం ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో త్వరలోనే రిక్రూట్ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం కానుండటంతో ఎస్పీ మణికంఠ చందోలు శిక్షణా కేంద్రంలో వివిధ సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. మొదట బ్యారక్ విభాగంను పరిశీలించిన ఎస్పీ రిక్రూట్లు నివసించే నివాస గదులు పరిశుభ్రంగా తగినంత గాలి, వెలుతురు వుండేలా చూడాలని ఆదేశించారు. రిక్రూట్ల ఆరోగ్యం దృష్ట్యా వైద్యబృందం ఎప్పటికప్పుడు అందుబాటులో వుండాలని, ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్ సదుపాయాలు సిద్దంగా వుంచాలని ఆదేశించారు.ఆర్ఐ ఎంటిఓ చంద్రశేఖర్, డిటిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెండి ఆభరణాలకు బిఐఎస్ ప్రమాణాలు

**పాలసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:**



బంగారు అభరణాల తరహాలో వెండి ఆభరణాలకు సైతం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్) భారత ప్రమాణాల మండలి నిబంధన వర్తిస్తుందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ స్టేట్ రిసోర్స్ పర్సన్ పావులూరు చిట్టిబాబు అన్నారు. బిఐఎస్ ప్రమాణాలు, నాణ్యత నిబంధనలపై పావులూరు చిట్టిబాబు శనివారం పాలసముద్రం, తిరుపతిల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ బంగారు ఆభరణాలకు అమలు చేస్తున్న తరహాలోనే వెండి అభరణాలకు సైతం ఈ నెల 1వ తేదీ నుండి బిఐఎస్ అమలులోకి వచ్చిందన్నారు. అలాగే వెండి అభరణాలకు 7 రకాల స్వచ్ఛత వుండేలా చూసుకోవాలన్నారు.

## నేడు కోలాకు సన్మానం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడుగా ఎంపికైన మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్‌ను ఆదివారం ఘన సన్మానం ఏర్పాటు చేసినట్లు బిజెపి సీనియర్‌నాయకులు సుధాకర్ శ్రీపురం తెలిపారు. పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 3గంటలకు సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సన్మాన సభకు ఎన్‌డిఏ కూటమి రాజకీయ పార్టీలకు అతీతంగా హాజరు కావాలని కోరారు.

## శివుని సేవలో హైకోర్టు జడ్జి



**శ్రీకాళహస్తి సెప్టెంబర్ 6ప్రభాతవార్త:** ముల్లోకాలుఏలే ముక్కంటీశుని శనివారం జస్టిస్ సుబ్బారెడ్డి హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కుటుంబసమేతకంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ప్రొటోకాల్ ఎఇఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఆలయ ఇనెస్పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్‌ఓ రవి ప్రోటోకాల్ జడ్జి బేబిరాణి, కోర్టు పర్యవేక్షకులు రవి కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యసేవ సమితిచే ఉపాధ్యాయులకు సన్మానం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనసన్మాన కార్యక్రమాన్ని కాళహస్తి మండలం వేడాం గ్రామం చిన్నమిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. సత్యసేవ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి యొక్క ప్రాధాన్యత ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు. సత్యసేవసమితి సభ్యులు చెంగయ్య, తారకరామయ్య, మునిరెడ్డి, బచ్చు యశ్వంత్, లలితమ్మ, చెంచులక్ష్మిలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు.

## వామ పక్షాల ధర్నా



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో శనివారం వామపక్షాల సారథ్యంలో కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. పట్టణంలోని పెండ్లి మండపం వద్ద సిపిఐ, సిపిఎం సారథ్యంలో చేపట్టిన ధర్నాలో కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కత్తి రవి, సిపిఎం కార్యదర్శి గంధం మణి సారథ్యంలో ధర్నా నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై కక్ష కట్టి విధిస్తున్న సుంకాలపై ప్రధాని ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో కత్తిరవి, గంధం మణి, తొందుమ ల్లికార్జున్, సిపిఎం నాయకులు రాపూరు సుబ్రమణ్యం ప్రజానాట్యమండలి కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు

## నానో యూరియా వాడకంతో ఖర్చు తక్కువ



**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ అని వ్యవసాయశాఖాధికారి రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం తొండమనాడులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఆయన మాట్లాడుతూ రైతులు పైర్లుకు ఆశిస్తున్న తెగుళ్ళను నివారించుటకు దుకాణం దారులు సూచించే ఎరువులను ఎక్కువ వాడుతున్నారని దాని వల్ల మేలు కంటే కీడు ఎక్కువ జరుగుతుందని గుర్తించుకోవాలన్నారు. అంతేకాక పంట రక్షణ దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతూ యూరియా అమితంగా వాడుతున్నారని వివరించారు. అయితే నేడు అత్యంత శక్తి వంతమైన నానో యూరియా, నానో డిఏపి వచ్చాయని వివరించారు. ఈకార్యక్రమాల్లో ఏఇ సూర్యప్రకాష్‌రెడ్డి, ఇస్కో సేల్స్ మేనేజర్ మణి చంద్ర, రైతు సేవా కేంద్ర సిబ్బంది కిరణ్మయి రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వసతుల కల్పనకు ప్రాధాన్యత



**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఆయన ఓ సామాజిక సేవకుడు, పేద విద్యార్థులకు చేయూతనిచ్చే సామాజిక కార్యకర్త. పాఠశాలలు అందంగా ఉండాలని భావించి పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చే ఉపాధ్యాయుడు గుమ్మడి మురళి. ఆయన జిల్లా ఉ త్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసి సత్కరించారు. ఆయన పని చేసిన ప్రతి చోట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రశంసలందుకున్నారు. ఆయన బదిలి అవుతున్నారంటే తల్లిదండ్రులు కుటుంబంలోని ఓ వ్యక్తిని బయటికి పంపేటట్లు బాధపడే వారు. ఆయన ప్రస్తుతం శ్రీకాళహస్తి మండలం వాంపల్లిలో ఉపాధ్యాయుడుగా పని చేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అధికారులచే అవార్డు అందుకున్నారు. 2008 డిఎస్‌సిలో ఉద్యోగం సాధించిన మురళి మొదటి ఉపాధ్యాయ పయనాన్ని కేవిబిపురంలోని కాశీవిశ్వనాథపురం నుంచి ప్రారంభించారు. ఇక్కడ పేద విద్యార్థులకు విద్యా సౌకర్యాలు పాఠశాలలో వసతులు కల్పనకు అవిశ్రాంతంగా కృషి చేసారు.

## నానో యూరియాతో...వినియోగంతో సత్ఫలితాలు



**చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** నానో యూరియా, నానో డి.ఎ.పి. వినియోగం సత్ఫలితాలను ఇస్తున్నట్లు ఏఓ సి.విజయభాస్కర్ అన్నారు. స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని నారావారిపల్లి, కందులవారిపల్లి, బి.కొంగరవారిపల్లి, భీమవరం, కొండ్రెడ్డికండ్రిగ, చిన్నరామాపురం రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎరువులకు, నానో ఎరువులకు మధ్యన గల వ్యత్యాసాలపై రైతులకు వివరించారు. రైతులు సాధారణ యూరియా, డి.ఎ.పిలకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డి.ఎ.పిల ప్రాముఖ్యతను గ్రహించి వినియోగించుకోవాలని సూచించారు.

## బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు: సిడిపిఓ



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిడిపిఓ ప్రదీప హెచ్చరించారు. శనివారం నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు తులసికుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా నెత్తకుప్పం గ్రామవీధులలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్లు నీలాదేవి, దేవిక, సరళ, మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధ్యాపకురాలుగా ఆచార్య హేమ



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఎస్‌వియులోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య హేమాకు వర్సిటీ ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రర్ ఆచార్య భూపతినాయుడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 బహుమతిని శ్రీనివాస ఆడిటోరియంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో ఇంజనీరింగ్ ఆర్ట్స్ సైన్స్ మేనేజ్మెంట్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి మంచి అకాడమిక్ పర్ఫామెన్స్ ప్రదర్శించిన ప్రతిభ కలిగిన ఆచార్యులను వర్సిటీ కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగపు ఆచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## నాన్ మెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



**తిరుపతి హెల్త్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** స్విమ్స్‌లో ఇటీవల జరిగిన ఉద్యోగాల నోటిఫికేషన్ మేరకు ఇతర విభాగాలలో పనిచేస్తున్న నాన్ మెడికల్ అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించే విధంగా సెంట్రల్ పే కమిషన్ ప్రకారం జీతాలు కల్పించి నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని బీజేపీ నేత పి. నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. వివిధ టీటీడీ అంశాలు, స్విమ్స్ ఉద్యోగుల జీతాల పెంపు, అర్హులకు తక్షణం పదోన్నతులు ఇవ్వాలనే డిమాండ్లపై శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

## 14న బలిజసేన రాష్ట్ర స్థాయి సమావేశం



**తిరుపతి హెల్త్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :** 14న బలిజ సేన రాష్ట్ర స్థాయి సమావేశం తిరుపతిలో జరగనుందని బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం, జిల్లా, నగర, పట్టణ, మండల, గ్రామ స్థాయిలోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన కుటుంబాలు, యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేష్, ప్రసాద్, వెంకటేష్, రఘు, సుబ్రమణ్యం, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## 8న పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలో పింక్ బస్ క్యాంపు

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సెప్టెంబరు 8న సోమవారం పరమేశ్వర మంగళం పీహెచ్‌సీలో పింక్ బస్ క్యాంపు జరగనుందని వైద్యాధికారి కె.హేమభూషణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపుకు వచ్చేవారు తప్పని సరిగా ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలర్ డా. ఆర్.వి.కుమార్, డీఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి కె.నాగరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనుంది.

## మంత్రి అనితను కలసిన నేయకులు



**కేవీబీ పురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** మంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలసి సత్యవేడు నియోజకవర్గంలోని అభివృద్ధిపై తెలిపారు. మంత్రిని కలసిన తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు సతీష్‌నాయుడు, పిచ్చాటూరు మాజీ ఎంపీపీ పద్మరాజు, ఆరె ఆయకట్టు మాజీ అధ్యక్షులు ప్రకాష్ నాయుడు, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు బాలరాజు, నారాయణవనం పార్టీ అధ్యక్షులు గిరి, ఒల్లూరు సర్పంచ్ సురేష్ చౌదరి మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గంలోని అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు.

## ట్రంప్‌పై మోదీ మెతకవైఖరి వీడాలి : సీపీఎం



**సత్యవేడు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** సత్యవేడు మండల పరిధిలో వామ పక్షాల ఆధ్వర్యంలో సత్యవేడు గాంధీ విగ్రహం వద్దనిరసన కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంపై 50 శాతం సుంకాలను విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పైమోదీ మెతక వైఖరిని వీడి తక్షణమే సుంకాలను రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని సీపీఎం, సీపీఐ పార్టీలు ఆధ్వర్యంలోసత్యవేడు కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్దన్, సీపీఐ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చినిరాజులు మాట్లాడుతూ భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలను దేశంలో ప్రతి పౌరుడు వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. తక్షణమే పెంచిన సుంకాలను తగ్గించేలా డోనాల్డ్ ట్రంప్‌పై మోదీ ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీనాయకులు అరుణాచలం, మురళి, మునస్వామి, కృష్ణయ్య, కొల్లాపూరి, లక్ష్మి, సుశీలమ్మ, సీపీఐ నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రేపు వడమాలపేటలో పింక్ బస్ క్యాంపు

**వడమాలపేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం వడమాలపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో పింక్ బస్సు క్యాంపు జరగనుందని మండల వైద్యాధికారి కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని, పరిసర ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

## విజయపురంలో గురుపూజోత్సవం



**విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** విజయపురం మండల కేంద్రంలో విద్యాశాఖ అధికారులు శ్యామల, హరిప్రసాద్‌వర్మ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ మాట్లాడుతూ అన్ని వృత్తుల వారిని తయారు చేసే వారు ఉపాధ్యాయులని ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానమని పేర్కొన్నారు. ఎంపీడీవో రాజేంద్రన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు అని పేర్కొన్నారు. మండల స్థాయిలో 20 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. సీఆర్పీ కార్యదర్శి వెంకమరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విష్ణువర్ధనరాజు చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి



**విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** మండలంలోని సూరికాపరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు విష్ణువర్ధనరాజు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం సూరికాపురం గ్రామంలో ఆయన కర్మక్రియలకు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు సుమారు ఒకటిన్నర ఏడాదిగా చెల్లించాల్సిన జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందాన ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏసుపాదం, ఏఐటీయూసీ మండల నాయకులు ముత్తు, రవి, రాజేంద్ర, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా సంబంధాలను పెంచుకోవాలి



**తిరుపతి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** చక్కటి ప్రజా సంబంధాలు ద్వారా ఉత్తమమైన సమాజాన్ని తయారు చేయవచ్చని ఇందుకోసం విద్యార్థి దశ నుంచే ప్రజా సంబంధాలను పెంపొందించుకోవాలని ఎంఆర్ పల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.హరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి లోని ఎంఆర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో తిరుపతికి చెందిన ఎడ్యుకేషనల్ అడ్వైజర్ కెవిఎస్ ప్రకాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి యువత వారధులుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ డా.జిఎస్. ప్రసాత్, సెక్రటరీ దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, పిఆర్ఎస్ఐ పూర్వ చైర్మన్ డా.స్వరాజ్యలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన



**తిరుపతిరూరల్, సెప్టెంబర్6 ప్రభాతవార్త:** నానో యూరియా, డి.ఏ.పి, జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని తనపల్లి రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. రైతులు పండించే పంటలలో రసాయన ఎరువులు వాడకం తగ్గించి, నానో ఎరువులైన నానో యూరియా, డి.ఎ.పి., జీవ ఎరువులైన ఫాస్పేట్‌ను కరిగించే ఫాస్పేట్ బాక్టీరియా, పొటాషియంను కరిగించే పోటాషియం బాక్టీరియా మెదలైనవాటిని వాడి, భూసారాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాధికారి ఏవి.సుబ్బారావు తెలిపారు. భూలక్ష్మీ ఫార్మర్ ప్రోడ్యూసర్ సంస్థ సిఇఓ గంగాధరం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతులు, బీజామృతం తయారీ విధానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలకు కుర్చీల వితరణ



తిరుపతి విద్య, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: తిరుపతి చిన్నబజారు స్ట్రీట్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో భీమా జ్యువెల్స్ సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలను అందజేశారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయురాలు, విద్యార్థుల సమక్షంలో కుర్చీలను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భీమా జ్యువెల్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆసుపత్రికి స్ట్రెచ్చర్ బహూకరణ



**తొట్టంబేడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి శనివారం శ్రీకాళహస్తికి చెందిన విజయా ఏజెన్సి వారు రోగుల సౌకర్యార్థం ఓ స్ట్రచర్‌ను బహూకరించారు. స్టీల్, సిమెంటు హోల్‌సేలర్స్ యజమాని బాలూ యాదవ్ ఆసుపత్రిలో పరిశీలించగా అత్యవసర రోగులకు ఉపయోగించే స్ట్రచ్చర్ లేకపోవటంతో రోగులను లోపలకు తీసుకెళ్ళ టానికి సిబ్బందిపడుతున్నఇబ్బందినిగుర్తించారు. ఆసుపత్రికిచెందినడాక్టర్‌విజయలక్ష్మి, హెడ్‌నర్సులకు అందజేసారు.

## మానవజీవన సరళిని మార్చేదే భగవద్గీత



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మానవజీవన సరళిని మార్చేది ఒక్క భగవద్గీత ఒక్కటే అని శ్రీ కృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెం బాకం ముని కృష్ణారెడ్డి వివరించారు. శనివారం ఆయన భగవద్గీత పవిత్ర గ్రంధాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ ఎఇఓ మోహన్‌కు అందజేసారు. సరైన మార్గంలో నడవాలంటే మానసిక ప్రశాంతత అవసరమని అన్నారు. అందుకే శ్రీకాళహస్తి లోనూ పరిసరాల్లో భగవద్గీత ను అందిస్తున్నట్లు వివరించారు.

## అవార్డులను అందుకున్న కుమారి నీరజ



తొట్టంబేడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: విద్యాప్రకాశానంద ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా పని చేస్తున్న డాక్టర్ పి.కుమారి నీరాజకి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును వరించింది, ఆమెకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు అవార్డును అందించారు. నీరజ తన విధినిర్వహణలో పరిశోధన, బోధనా రంగాల్లో వీరి కృషికి ప్రభుత్వం గుర్తించినట్లు నీరజ వివరించారు. తమ కళాశాలకు చెందిన లెక్చరర్‌కు అవార్డు లభించటం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.బి.రాజశేఖర్ అన్నారు. వీరు తమ గురువు డాక్టర్ డి.ఎం.ప్రేమావతి, ఆచార్య విజయలక్ష్మిలు ఎంతో ప్రోత్సహించినట్లు నీరజ వివరించారు.

# తిరుపతి డివిజన్

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**పుత్తూరు (నగరి), సెప్టెంబరు 6 ప్రభాతవార్త :** అఖిల భారత క్షత్రియ మహాసభ (1897) ఆధ్వర్యంలో శనివారం నగరి మండలంలోని గుండ్రాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. తిరుపతికి చెందిన వాసన్ ఐకేర్, మాధురి రెమిడీ ఆస్పత్రి వైద్యులు మాధురి గాంధీ, సింధుజ, కుమార్, కళావతి, అంజి, వెంకటేష్, అంబికా, మంజునాథ్, చిట్ల సారిక సుమారు 175 మందికి రక్త, షుగర్ పరీక్షలు, మహిళలకు అంకాలజీ పరీక్షలు నిర్వహించారు. అలాగే 37 మందికి కంటిలో శుక్లాలు వున్నందున శస్త్ర చికిత్స కోసం వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి, ఇంకా క్షత్రియ సంఘం నాయకులు కోనేటి రవిరాజు, బాలసుబ్రమణ్యంరాజు, రామ్మోహన్, వర్మ, చిన్నబ్బరాజు, ఉమాపతిరాజు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజా రాణి, ఉపాధ్యాయుడు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

**పుత్తూరు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వున్న స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి మూడున్నర నెలలు కాలవ్యవధి వున్న ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి వున్న నిరుద్యోగ యువత ఈ నెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సర్టిఫికెట్ ఇస్తుందన్నారు. కాలేజీలో స్కిల్ హబ్ కేంద్రంలో అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, విద్యార్హత మార్కుల జాబితా జెరాక్స్ కాపీలు, పాస్ పోర్ట్ సైజు ఫోటోతో అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్.రసూల్ (6300954441) నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

## రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లికి ఘన స్వాగతం



**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** తిరుపతి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జల్లి మధుసూదన్ గారికి తిరుపతిలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం కెన్సస్ హోటల్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా జరిగినది. తిరుపతి పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన బి.సి.బంధువులు తమ ఆత్మీయతను వ్యక్తం చేస్తూ, మధుసూదన్‌ని పూలమాలలతో సత్కరించారు. సన్మాన సభలో మాట్లాడిన నేతలు, కార్యకర్తలు మాట్లాడుతూ బి.సి. వర్గాల నుండి రాష్ట్ర స్థాయిలో ఇంత ప్రతిష్టాత్మక పదవిలో నిలవడం ఒక గౌరవకారణమని, జల్లి మధుసూదన్ పార్టీ విధానాలను ప్రజల దగ్గరికి తీసుకువెళ్తూ సామాజిక న్యాయం, అభివృద్ధి సాధనలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు బి.సి. సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌కి తిరుపతిలో ఘన స్వాగతం



**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు సత్య కుమార్ కి అలాగే నూతనంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాగోతు రమేష్ నాయుడుకి తిరుపతిలో బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. తిరుమల ఎక్స్ప్రెస్ లో తిరుపతి రైల్వే స్టేషన్ కు చేరుకున్న వీరికి బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి స్వాగతించారు. బిజెపి నాయకులు అన్నా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఏ వన్ మస్తాన్, పార్వతి, నాగోతు హరి నాయుడు ఒలేటి చంద్రబాబునాయుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావాన్ని పెంచుతున్న నగర సంకీర్తన



**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి క్షేత్రంలో అడుగడుగునా భక్తి భావం పెంపొందించాలన్న సంకల్పంతో స్థానిక భజన మండలి కళాకారులు శ్రీవారికి ఎంతో ఇష్టమైన శనివారం రోజున నగర సంకీర్తన చేస్తున్నారు. వందమందికి పైగా భజన మండలి కళాకారులు ప్రతి శనివారం ఉదయం ఐదు గంటలకి సాంప్రదాయ వస్త్రాలతో నుదుటిపైన గోవింద నామాలతో స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి తిరు వీధులలో నగర సంకీర్తన చేస్తు నగరంలో ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ వాసుదేవ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మేకల గంగయ్య కొండే చెంగారెడ్డి మునినాథరెడ్డి భాస్కరాచారి మురళి తొండము నాటి సుబ్రహ్మణ్యం అన్నూరు మునిరత్నమాచారి మధు పద్మావతి సిద్ధమ్మ అరుణ జయమ్మ పార్వతి మునేంద్ర రెడ్డి కోటి ముని కృష్ణారెడ్డి రెడ్డి మల్లారపు మణికంఠ వాసు బాబు కల్పన యశస్విని విగ్రహాల కళ్యాణి పార్వతి తదితరులు పాల్గొన్నారు

## రాజకీయ రంగు పులుముకున్న డయేరియా!



**రేణిగుంట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** గుత్తివారిపల్లెలో విజృంభించిన డయేరియా చిలికి చిలికి గాలి వానగా మారి ఎట్టకేలకు రాజకీయ రంగు పులుముకుంది. ఒకపక్క డయేరియాతో బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరి కొంతమంది ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబాలు పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్నాయి. బాధితులకు ఎలా న్యాయం చేయాలి? దయరియా ప్రబలకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి?డయేరియా బారిన పడిన వారికి ఎలాంటి వైద్య సేవలు అందించాలి? బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, ధైర్య వచనాలు చెప్పడం విస్మరించి డయేరియాకు రాజకీయ రంగు పులుముతున్నారు. ప్రభుత్వ వైఫల్యం అంటూ వైసిపి నేతలు విమర్శలు గుప్పిస్తుంటే, వైసిపి శవ రాజకీయాలు చేస్తుందంటూ అధికార పార్టీ నేతలు తిప్పి కొడుతున్నారు. ఒకరు తిరుపతిలో మరొకరు మహారాష్ట్ర షిరిడిలో మరణించడంతో డయేరియా వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో అధికారులు ఉరుకులు పరుగులతో గుత్తి వారి పల్లె గ్రామం చేరుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అధికారులు వైద్య సౌకర్యాలు, పారిశుధ్యంపై దృష్టి సారించారు. రేణిగుంట పట్టణంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ కోసం పంచాయితీ కార్యదర్శి మాధవి తమ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు.

## ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిరసన



**రేణిగుంట, సెప్టెంబర్ 6ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష నేతలు రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామ పక్ష నేతలు మాట్లాడుతూ ట్రంప్ తో సహా అమెరికా పెత్తందారులు భారతదేశాన్ని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు ఓ వి రమణ, హరినాథ్, సిపిఐ సీనియర్ నాయకులు మణి, మురళి, అమ్ములు, గురవయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కమిటీ నిరసన



**రేణిగుంట, సెప్టెంబర్ 6ప్రభాతవార్త:** రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేశం కు మద్దతుగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కమిటీ నేతలు శనివారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ ప్లాన్ కమిటీ అధ్యక్షుడు ఐజయ్య మాట్లాడుతూ దళిత సర్పంచ్ కుర్చీని లాక్కోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో సబ్ ప్లాన్ కమిటీ నేతలు హరినాథ్, తులసి రాజన్, ఈశ్వరి, సిపిఎం నాయకులు ఓ వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు వరం



**రేణిగుంట, సెప్టెంబర్6 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం సామాన్యులు వినియోగించే వస్తువులపై జీ ఎ స్టీ తగ్గించడం గొప్ప వరమని బిజెపి యువ నాయకులు, బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్ అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పేదల పక్షపాతులన్నారు. బిఎంఎస్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామని వెంకటాద్రి యాదవ్ తెలిపారు.

**CHANGE OF NAME**

● I, CUTTAMANCHI LOKANANDHAM (old Name)R/at8-57,Cherlopalle(V&P),chittoor Dist, AP,changed my name to CUTTAMANCHI LOKANADHAM S/o CUTTAMANCHI VAJRAVELU PILLAI.Henceforth, I will be known as CUTTAMANCHI LOKANADHAM (New Name).

● I,MAVULOORI MOHAN KUMARI (Old Name) R/at D.No.Sandhu Street, Bhakarapet, Chinnagottigallu (M), Tirupati Dist, AP, changed my name to MAVULOORI MOHANA KUMARI W/o MAVULOORIJANARDHANA GUPTA, Henceforth, I will be known as MAVULOORI MOHANA KUMARI(New Name)

# మా గ్రామాన్ని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి

**- మా భూములకు ప్రస్తుత ఉన్న విలువ ప్రకారం నష్టపరిహారం ఇప్పించాలి - స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**



గూడూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని మన్నే గుంట పంచాయతీలో శనివారం గ్రామ సర్పంచ్ ఇరగరాజు ఏడుకొండలు అధ్యక్షతన రెవెన్యూ జిందాల్ పరిశ్రమ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ మన్నెగుంట గ్రామాన్ని రెవెన్యూ రికార్డులో నమోదు చేసి హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గత 18 సంవత్సరాల క్రితం ఈ గ్రామంలో ఉన్న రైతులు పొలాలకు కొంతమేరే నష్టపరిహారం చెల్లించి ఉన్నారని మిగిలిన రైతులకు కూడా ఇప్పుడు ఉన్న రేట్లు ప్రకారం పరిహారం అందించాలన్నారు. చిలకూరు తహశీల్దార్ కె.శ్రీనివాసులు మీ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సర్పంచి ఇరగరాజు ఏడుకొండలు జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు ఏపీఐఐసి ప్రసాదులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి కుట్ర

**- సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి**



కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి, ఏడు కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు ఐదు కళాశాలల్లో తరగతులు ప్రారంభించారని కోట మండలం సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి చెప్పారు. శనివారం ఆయన తన నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పది మెడికల్ కాలేజీలను తమ వారికి కట్టబెట్టేందుకు కుట్రకు తెరతీసిందన్నారు. తద్వారా వేల కోట్లు దోచుకునేందుకు స్కెచ్ వేశారని తెలిపారు. 40ఏళ్ల ఇండస్ట్రీ అంటావు, 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని చెబుతావు, నీ రాజకీయ జీవితంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా తెచ్చావా అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. 15 నెలల్లో ఏకంగా రెండు లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. మెడికల్ కాలేజీల కోసం ఆరువేల కోట్లు ఖర్చు చేయలేరా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయిన వెంటనే ఇప్పుడు ప్రైవేటీకరణ చేస్తున్న కాలేజీలను రద్దు చేయిస్తామన్నారు. ఎవరి లబ్ధి కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటుపరం చేసి బీమా విధానంలోకి తీసుకొస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు కనీసం గిట్టుబాటు ధర కూడా కల్పించలేని ఈ కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు.

## శ్రీచెంగాళమ్మ ఆలయం మూసివేత

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు మూసివేస్తున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 9గంటల అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని అసిస్టెంట్ కమిషనర్ కోరారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి : ఎంపిడిఓ

కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో బాల్య వివాహాలు జరిగేటట్లు అనుమానాలుంటే వెంటనే ఆయా కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ కోరారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో శనివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల సెక్టార్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పిల్లలు ఖచ్చితంగా ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరు పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



చిల్లకూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: అమ్మాయి తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని మేమిద్దరం మేజర్లం అంటూ చిల్లకూరు పోలీసులను ప్రేమ జంట ఆశ్రయించింది. ఇద్దరు కులాలు వేరు కావడంతో పెద్దలని ఎదిరించి ప్రేమికులు ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహమని తల్లిదండ్రులు వాళ్ళ ప్రేమను నిరాకరించడంతో పెళ్లి చేసుకున్నామని ప్రేమికులు తెలిపారు. అమ్మాయిది శ్రీకాళహస్తి రూరల్ మండలం తొండమనాడు గ్రామం, అబ్బాయిది చిల్లకూరు మండలం ఎగురాజుపాలెం పంచాయతీ మర్లమిట్ట గ్రామం అని తెలిపారు. మా తల్లిదండ్రుల నుంచి మమ్మల్ని రక్షించండి అంటూ పోలీస్‌ని ప్రేమ జంట ఆశ్రయించారు.

## సిఐ వెంకటరమణకు నేడు పౌరసన్మానం

కోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: కోట మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తురకా వెంకటరమణ అలియాస్ గబ్బర్‌సింగ్ 2012 సంవత్సరంలో పనిచేశారు. ఆయన పనిచేసిన సమయంలో ఈ ప్రాంతంలో రౌడీషీటర్లను అణచివేశారు. ఆయన ఎప్పుడూ పేదలపక్షాన నిలుస్తూ న్యాయం చేశారు. ఆ క్రమంలో ఎస్ఐ వెంకటరమణను రాజకీయ నాయకులు బదిలీ చేయంచారు. బదిలీ అయిన సమయంలో దళిత సంఘాలు, ఆటో కార్మికులు, ప్రజాసంఘాలు బదిలీ ఆపాలంటూ ధర్నాలు, రాస్తారోకోలు సైతం చేశారు. ఆయన పల్నాడు జిల్లాలోని మాచర్ల ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం కోటలోని షాదీమంజిల్‌లో దళిత, ప్రజాసంఘాలు ఆయనకు పౌరసన్మానం చేయనున్నారు.

## నానో వ్యవసాయ ఉత్పత్తులతో రైతులకు ప్రయోజనం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: నానో సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన యూరియా, డిఏపీ, బయో ఫర్టిలైజర్స్ వంటి వ్యవసాయ ఉత్పత్తులతో రైతులకు మంచి ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి కాంచన తెలిపారు. శనివారం మండల పరిధిలోని మంగలంపాడు గ్రామంలో నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నానో, డిఏపిలో 8 శాతం నైట్రోజన్, 16 శాతం పాస్ఫరస్ ఉంటాయని, డిఏపి చిన్న కణాల కారణంగా పోషకాల వినియోగ సామర్థ్యం 90 శాతం కంటే ఎక్కువ ఉంటుందని చెప్పారు. పంట పెరుగుదల దశను బట్టి రైతులు వ్యవసాయ నిపుణుల సలహాలతో ఉపయోగించాలని ఎట కాంచన సూచించారు. అనంతరం మంగలంపాడు గ్రామంలో రైతులతో ప్రదర్శన చేశారు.

## ట్రంప్ నిర్ణయాలపై వామపక్షాల ఆందోళన



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ ఎగుమతులపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండు వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి రియాజ్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, అమెరికా 50 శాతం సుంకాలతో రాష్ట్రంలో ఆక్వారంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. సిపిఐ నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ భారతదేశ విదేశాంగ విధానాన్ని పటిష్టపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు అక్బర్‌బాషా, భాస్కర్, చంద్రయ్య, మహేష్, ఖలీల్, నాగరాజు, చంద్రబాబులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ పద్మను అకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఎన్ఎంయు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేనిరాహార దీక్షలు శనివారం 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ విషయమై డిపో సెక్రటరీ ఎం.శేఖర్ మాట్లాడుతూ డిపోలో జరుగుతున్న అన్యాయం గురించి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 476వ నేత్రదానం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శనివారం 476వ నేత్రదానం అందింది. పొట్టిశ్రీరాములు వీధికి చెందిన కర్లపూడి నటరాజ మృతిచెందడంతో ఆయన నేత్రాల నుంచి కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## డీన్ డాక్టర్ వేణు మాధవ్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



గూడూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: ఆది శంకర యూనివర్సిటీ డీన్ డాక్టర్ వేణు మాధవ్‌కు విద్యార్థి ప్లేస్‌మెంట్, కెరీర్ అభివృద్ధిలో అద్భుత కృషి అవార్డును అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని సిపిఎస్ఈ ఇండియా తరపున సెప్టెంబర్ 5న నేషనల్ టీచర్స్‌డే సందర్భంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ వేణు మాధవ్ ఎల్లప్పుడూ విద్యార్థుల కెరీర్‌కి ప్రాధాన్యత ఇస్తూ, ఇండస్ట్రీఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ను బలోపేతం చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో యూనివర్సిటీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు, ఆన్‌జాబ్ ట్రైనింగ్‌లు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు వంటి విభిన్న అవకాశాలు పొందారు. విద్యార్థుల కెరీర్ సేవల విభాగంలో ఆయన తీసుకున్న సృజనాత్మక ఆవిష్కరణలు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ టిపి శశికుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ రాజయ్యలు అభినందించారు.

## బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడుకి ఘన స్వాగతం



గూడూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన నాలి మధుసూదన్ యాదవ్ ఎన్నికయ్యారు. శుక్రవారం గుంటూరులో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్ యాదవ్ గూడూరుకు విచ్చేశారు. ఆయన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విగ్నేశ్వరపురం వద్ద ఉన్న వినాయకుడి గుడిలో దేవుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ర్యాలీగా గూడూరు పట్టణ పురవీధుల గుండా రెండో పట్టణంలోని మహాలక్ష్మమ్మ గుడి వద్దకు చేరుకుని అమ్మవారికి మొక్కలు తీర్చుకుని అనంతరం ఇంటికి చేరుకున్నారు.

## ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు



వాకాడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నర్స్ ద్వారా ప్రజల చేతిలోనే ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన వాకాడు అశోక పిల్లర్ సెంటర్ వద్ద వాట్సప్ గవర్నర్స్ సేవలపై ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి మన మిత్ర కార్యక్రమం పై అవగాహన కల్పించి, ప్రతి ఇంటికి ఒక సర్వే చేయాలని సూచించారు. దీంతో ప్రజలకు త్వరగా ప్రభుత్వ సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ ర్యాలీలో డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## బయో ఎరువులను ఉపయోగించాలి:ఏవో



వెంకటగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: రైతులు నానో బయో ఎరువులను ఉపయోగించాలని వ్యవసాయశాఖ అధికారిని సుజాత తెలిపారు. బయో ఫెర్టిలైజర్స్, నానో యూరియా, నానో డిఏపిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయో ఫెర్టిలైజర్స్, నానోయూరియా, నానో డిఏపి పైన రైతులకు అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగినది. వ్యవసాయాధికారిణి ప్రవీణ రైతులనుద్దేశించి ప్రస్తుతం నానో యూరియా అవశ్యకతను, ఉపయోగములను వివరించారు. ఏఈఓ రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

## ఈనెల 13వ తేదీ నేషనల్ లోక్ అదాలత్

వెంకటగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: ఈనెల 13వ తేదీ జరగబోవు నేషనల్ లోకల్ విరివిగా కేసులను రాజీ చేయాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. ఈనెల 13వ తేదీ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆవరణలో జరిగే నేషనల్ లోకదాలత్‌పై బ్యాంకు మేనేజర్లతో జడ్జి సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోకాదాలతో పరిష్కరింపజేయాలని బ్యాంకర్లకు సూచించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## లింగ వివక్షతను నిర్మూలించాలి సిడిపి

వెంకటగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: లింగ వివక్షత లేకుండా నిర్మూలించాలని సిడిపివో శంషాబాద్ బేగం తెలిపారు. పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 12 రోజులు పాటు జరిగే మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ బాలురు బాలికలను సమానంగా చూడాలని చెప్పారు.

## బాల్య వివాహాల పై అవగాహన

గూడూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని జడ్పీ గర్ల్స్ హై స్కూల్ నందు ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి, బేటి బచావో, బేటి పడావో సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిబ్బంది శారదాంబ, మాధవి, లక్ష్మి, స్వరూప రాణి, హైమవతి, చెంచు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుకు సన్మానం ఘన సన్మానం



పెళ్లకూరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెళ్లకూరు లోని మండల పరిషత్ కార్యాలయం నందు శనివారం నాడు ఎంపీడీవో ప్రమీల రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిలో టి.విజయ్ కుమార్ (ముమ్మారెడ్డి గుంట), పిచ్చుక సుధాకర్ (అర్థమాల), ఓ.జగదాంబ (చెంబెడు), బి.జగన్నాథం (పుల్లూరు), బి మాధవి( కలవకూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఎద్దుల నరేందర్ రెడ్డి,జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, సంచి కృష్ణయ్య, జనసేన మండల అధ్యక్షులు విజయ్ మల్లం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పునబాక పోలయ్య మరియు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దన్న



శాంతిపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిమ్మరాజుపల్లి గ్రామంకు చెందిన పెద్దన్న నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుటుంబానికి, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికె ఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబుతో పాటు నియోజకవర్గ నేతలకు రుణపడి ఉంటానన్నారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానన్నారు.

## సమాజ జాగృతిలో ఉపాధ్యాయులే కీలకం: ఎమ్మెల్యే



పుత్తూరు (నగరి), సెప్టెంబరు 6 ప్రభాతవార్త : సమాజాన్ని జాగృతం చేయడంలో ఉపాధ్యాయులే కీలకమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. నగరిలో శనివారం జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల అంటే సమాజానికి ఉత్తమ పౌరులను అందించే నిలయమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సమస్యలను గుర్తించి పరిష్కరిస్తోందని తెలిపారు. మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల కొరతను తీర్చిందన్నారు. మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తన తండ్రి దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు కూడా అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేశారని తెలిపారు. విద్యార్థులను భావి తరాలుగా గుర్తించేలా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని దాని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

**పుత్తూరులో:**

కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానం దక్కుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం పుత్తూరులో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు అవార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు దిశా నిర్దేశం చేసే గురువులే అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్. పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పవిత్రాల ఊరేగింపు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లతోపాటు పరివార దేవతలకు సమర్పించే పవిత్రాలు, పట్టు వస్త్రాలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపం నుంచి పట్టు వస్త్రాలును పూజలకు తరలించారు. ఆలయంలో వాటిని ఊరేగింపుగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎఇఓ ప్రసాద్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామిఆలయ ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాధన్, అలంకార గురుకుల్ సూరిగురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి, తేవారం గురుకుల్ ముత్తుకుమార్‌స్వామిలు వెంటరాగా పవిత్రాలను ఊరేగించారు. వీటిని యాగశాలకు తరలించారు. అక్కడ డాక్టర్ స్వామినాధన్ పూజలు నిర్వహించారు. హారతులిచ్చారు.

## ఎంజిఎం సారథ్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఎంజిఎం ఇన్స్టిట్యూట్‌లో శనివారం ఘనంగా గ్రాంట్‌పేరెంట్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు డైరెక్టర్ మయూర్ అధ్యక్షతన జరిగింది. ఛైర్మెన్ గుడ్లూరు మల్లికార్జున్‌నాయుడు మనవడు, మనవరాలుతో కలసి జ్యోతి ప్రజ్వాలన చేసారు. ఈ సందర్భంగా అవ్వలు, తాతలు చేతుల మీదుగా భోజనం తినిపించి సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా గ్రాండ్ పేరెంట్స్ వేషధారణలో వచ్చి పాటల పోటీలతో సందడి చోటు చేసుకుంది. గుడ్లూరు మమూర్ మాట్లాడుతూ మన సంప్రదాయాలు, సంస్కృతికి చిన్నారులు దూరమౌతున్నారు. పలువురు గ్రాండ్ పేరెంట్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బరత్నం, స్కూల్ హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా పద్మావతి అమ్మవారి పవిత్ర సమర్పణ

**- చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయం మూసివేత**



తిరుచానూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రసమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. తరువాత పవిత్ర సమర్పణ చేశారు. ఇందులో అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమానప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం చక్రస్నానం నిర్వహించనున్నారు. పూర్ణాహుతి వైదిక కార్యక్రమాల అనంతరం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం రెండు గంటల 15 నిమిషాలకి ఆలయం మూసి వేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్ టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుభాస్కర్, ఎవియస్ఓ రాధాకృష్ణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడు

చిత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: ప్రేమించిన అమ్మాయి వివాహం చేసుకోవడానికి నిరాకరించడంతో మనస్థాపం చెందిన యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెనేబండ హరిజనవాడలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. మృతి చెందిన సతీష్(27) అదే ప్రాంతంలో నివాసం వుంటున్న ఓ యువతితో గత 8 సంవత్సరాలుగా సంబంధం సాగిస్తున్నాడు. అయితే ఆ యువతి కొన్ని వివాదాల కారణాలతో అతనిని వివాహం చేసుకోవడానికి తిరస్కరించింది. దీంతో మానసిక క్షోభకు గురైన సతీష్ సమీపంలోని బావిలో దూకి శనివారం ఉదయం 10 గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడు. సతీష్ బావిలో దూకి మృతి చెందిన విషయం తెలిసన స్థానికులు అతని మృతదేహంను స్థానికులు వెలికి తీశారు. అప్పటికే సతీస్ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్తే ఎద్దైనా ఫలితం వుంటుందని భావించిన స్థానికులు అతని మృతదేహంను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అయితే అప్పటికే సతీష్ మృతి చెందాడని వైద్యులు తేల్చిచెప్పారు. ఈ మేరకు మృతుడు సతీష్ సోదరుడు బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం అందించిన... బాబులాల్‌కు అవార్డు



తొట్టంబేడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కుమారస్వామి తిప్పలో పుట్టి పెరిగిన బాబులాల్ ఉపాధ్యాయుడుగా పాతికేళ్ళుగా చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్నారు. ఓనమాలు నేర్పించే గురువుకు ఈ ఏడాది తిరుపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు వరించింది. చిన్నారులకు అక్షరాలు దిద్దించటం ఫౌండేషన్ సమర్థవంతంగా నేర్పించటంలో ఆయన ఎంతో ఓర్పు, సహనంతో వ్యవహరించారు. శ్రీకాళహస్తిలోని ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన బాబులాల్ 2000 సంవత్సరం ఉపాధ్యాయుడుగా డిఎస్‌సి పాస్ అయ్యారు. మొదటి ప్రస్తానం సత్యవేడు నియోజకవర్గంలోని మారు మూల గ్రామం అయిన సిఆర్‌సి కండ్రిగలో దక్కింది. అక్కడ దీర్ఘకాలం పని చేసిన ఆయన తరువాత శ్రీకాళహస్తి మండలంలోని పెంకుల పాడు గ్రామంలో లభించింది. శ్రీకాళహస్తికి సమీపంలోని గ్రామం అయినందువల్ల ఎక్కువ సమయం కేటాయించారు. చిన్నారులకు అక్షరాలు నేర్పటమే కాకుండా పసి వయస్సులోనే సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్ల గురించి అవగాహన కల్పించారు. ఆయన ప్రారంభం నుంచి అందించిన సేవలను గుర్తించిన విద్యాశాఖ ఆయనకు 2025 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసారు. శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ చే సత్కరించారు. ఈ సందర్భంగా శనివారం బాబులాల్ మాట్లాడుతూ తన సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. అవార్డులు తమపై బాధ్యతలను పెంచుతుందని అభిప్రాయపడ్డారు.

## 9న అన్నదాత పోరు... పోస్టర్ ఆవిష్కరించిన అభినయ్



తిరుపతి, సెప్టెంబర్ 6ప్రభాతవార్త: రాష్ట్ర వైసిపి అధిష్టానం పిలుపుమేరకు తిరుపతిలో ఈనెల 9న రైతుపోరు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. వైసిపి తిరుపతి ఇన్‌ఛార్జి భూమన అభినయ్‌రెడ్డి శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసిపి శ్రేణులు తరలివచ్చి పోరును విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, వైసిపి నాయకులు ఆరే అజయ్‌కుమార్, చంద్రమౌళిరెడ్డి, తలారి రాజేంద్ర, కొట్టాలచంద్ర, నల్లనిబాబు, మల్లంరవికుమార్, గంగాధర్‌యాదవ్, షఫీఖాద్రి, సాయికుమారి పాల్గొన్నారు.

## అనంతపద్మనాభవ్రతాన...వేడుకగా చక్రస్నానం



తిరుమల, సెప్టెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి: అనంతపద్మనాభ వ్రతం సందర్భంగా శనివారం పవిత్రమైన రోజు స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానమహోత్సవం ఆలయఅర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయం నుండి చక్రత్తాళ్వార్‌కు వరాహస్వామి ఆలయం చెంత ఉన్న స్వామిపుష్కరిణిలో అభిషేకం చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు

## శ్రీసిటీని సందర్శించిన చెన్నై ఏంజిల్స్ ప్రతినిధుల బృందం



సత్యవేడు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: చెన్నై ఏంజిల్స్ సంస్థకు చెందిన 19 మంది సభ్యుల ప్రతినిధి బృందం శుక్రవారం రెండు రోజుల పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. 2009లో ఏర్పాటైన చెన్నై ఏంజిల్స్ సంస్థ, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వాటి వృద్ధిని వేగవంతం చేయడంలో అపార వ్యాపార చతురత, అనుభవం, నెట్‌వర్క్ కలిగి ఉంది. ఈ సందర్శన పట్లసంతోషం వ్యక్తం చేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వీరి ఆలోచనలను పంచుకోవడం ద్వారా శ్రీసిటీ భవిష్యత్ వ్యూహాత్మక రోడ్డు మ్యాప్‌ను మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుందన్నారు. పర్యటనలో భాగంగా, ప్రతినిధి బృందం ఇదే సమయంలో శ్రీసిటీ సందర్శనలో ఉన్న వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ టి.హెచ్.హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికాం రంగంలో అపార అనుభవం కలిగిన చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక అంశాలను వారితో పెంచుకున్నారు.

## గరుడ వాహనం తయారీకి అనుమతులు ఇవ్వండి

**టిటిడి ఛైర్మన్‌ను కోరిన సలహా సభ్యులు**

పుత్తూరు(నగరి), సెప్టెంబరు 6 ప్రభాతవార్త : టిటిడి ఆధీనంలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో దాతల సహకారంతో గరుడ వాహనం సిద్ధం చేయడానికి టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు సంసిద్ధత వ్యక్తం చేశారని ఆలయ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరుడ వాహనం సిద్ధం చేసి ఇవ్వడానికి దాతలు ముందుకు వస్తున్నారని దానికి అనుమతి ఇవ్వాలని ఈ నెల మూడో తేదీన ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను సభ్యులు కోరారు. ఆ మేరకు ఎమ్మెల్యే టిటిడి దృష్టికి రాతపూర్వకంగా ఆ విషయం తెలిపారు. దాంతో టిటిడి కార్యాలయం నుంచి సభ్యులకు ఆహ్వానం అందడంతో శనివారం ఛైర్మన్‌ను కలిసి గరుడ వాహనం తయారీ అంశాన్ని ఆయనకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన తగిన చర్యలు తీసుకునేందుకు జెఇఒకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దాతల ద్వారా వాహన తయారీకి తగిన సహకారం ఇవ్వాలని జెఇఒను ఆదేశించినట్టు తెలిపారు. టిటిడి సహకారంతో త్వరలోనే గరుడ వాహనాన్ని సిద్ధం చేస్తామని సభ్యులు తెలిపారు. టిటిడి ఛైర్మన్‌ను కలిసిన వారిలో ఆలయ సలహా సభ్యులు జ్యోతినాయుడు, ఆనం సురేష్‌నాయుడు, జి.రాజశేఖర్, ఎన్.సి.శేఖర్, మనోహర్‌నాయుడు తదితరులున్నారు.